క్లుప్తంగా

ధర్మరాజు సేవలు ఆదర్శనీయం



గుడ్లవల్లేరు: ఉమ్మడి జిల్లాలోని ఎంతోమంది గ్రామ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు శిక్షణ ఇచ్చి, జిల్లా ట్రెనింగ్ మేనేజర్‌గా సేవలు అందించిన గుడ్లవల్లేరు మండలంలోని కట్టవానిచెరువు మాజీ సర్పంచ్ అబ్బదాసరి ధర్మరాజు సేవలు ఆదర్శనీయమని జెడ్పీ సీఈఓ కె.కన్నమనాయుడు అన్నారు. ధర్మరాజు పదవీ విరమణను పురస్కరించుకుని ఆదివారం ఆయన్ను విజయవాడ డీపీఆర్సీ కార్యాలయంలో సీఈఓతో పాటు సిబ్బంది ఘనంగా సన్మానించారు.

ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ



అడ్డాడ(పామర్రు): పామర్రు మండలం అడ్డాడ జెడ్పీ హైస్కూల్ ప్రహరీ గోడ నిర్మాణానికి ఆదివారం ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిధులతో ప్రహరీ గోడను నిర్మిస్తున్నామన్నారు. అంతేకాకుండా రిమ్మనపూడి, అంకమ్మగుంట, జమీగొల్వేపల్లి తదితర గ్రామాల్లో సీసీ రోడ్లను నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అడ్డాడ సర్పంచ్ పామర్తి త్రినేత్రి, పీఆర్ ఏఈ రామారావు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ గణపతి హోమం



గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్డులోని విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం లక్ష్మీ గణపతి హోమం ఘనంగా నిర్వహించారు. బహుళ చవితి సంకట హర చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ హోమం నిర్వహించినట్లు ఆలయ ఈఓ వై.శ్రీనివాస్ తెలిపారు. ఈ హోమం నిర్వహించడంతో భక్తుల కోరికలు నెరవేరడంతో పాటు సమాజానికి మేలు జరుగుతుందని విశ్వాసం ఉందన్నారు. 93 మంది దంపతులు ఈ హోమంలో పాల్గొన్నట్లు తెలిపారు.

అన్నసమారాధన



గుడివాడ టౌన్: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన పందిరిలో ఈ సమారాధన నిర్వహించారు. శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ముగిసిన సందర్భంగా అమ్మవారికి శాంతి నిమిత్తం ఈ అన్నప్రసాదం పంపిణీ చేశామన్నారు. నిర్వాహకులు రమణ, దండెం శివ, చుండూరి శేఖర్, కృష్ణారావు, ప్రసాదు, సీతారామయ్య పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల ఏర్పాటు



కొండిపర్రు(పామర్రు): పల్లె పండుగ కార్యక్రమంతో గ్రామాల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు ఏర్పడుతున్నాయని పార్టీ నాయకులు నూకారపు వీరాంజనేయులు పేర్కొన్నారు. మండలంలోని కొండిపర్రులో సీసీ రోడ్ల నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ పసుపులేటి రుక్మిణీ, నాయకులు సత్యనారాయణ, విజయ్‌కుమార్, సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు పెదపారుపూడి మండలంలో పబ్లిక్ గ్రీవెన్స్

గుడివాడ టౌన్: గుడివాడ డివిజన్ పెదపారుపూడి మండల ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ జి. బాలసుబ్రహ్మణ్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణాజిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు సోమవారం ఉదయం 10 గంటలకు పెదపారుపూడి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అన్నిశాఖల అధికారులతో కలిసి ప్రజాసమస్య వేదిక నిర్వహిస్తామని పేర్కొన్నారు.

బాలికల వసతిగృహం..
అసౌకర్యాల నిలయం

సాంఘిక సంక్షేమ ఎస్సీ బాలికల వసతిగృహం నరకకూపంగా మారింది. ఆర్థిక పరిస్థితి లేని తల్లిదండ్రులు తమ బిడ్డలను హాస్టళ్లకు పంపుతుంటే సౌకర్యాల కల్పనలో అధికారులు విఫలమవుతున్నారు. తమ తల్లిదండ్రులకు భారం కాకూడదనే భావనతో ఇబ్బందులు కలుగుతున్నా బాలికలు భరిస్తూ హాస్టల్లోనే చదువులు కొనసాగిస్తున్నారు.

- మరుగుదొడ్ల కొరతతో ఇక్కట్లు
- వర్షం వస్తే రెండు అడుగుల నీరు



అద్దె భవనంలో ఆటపాక బాలికల హాస్టల్



ఇటీవల హాస్టల్లోకి చేరిన వర్షం నీరు

కైకలూరు: ఆటపాక ఎస్సీ బాలికల హాస్టల్లో అడుగడుగునా సమస్యలు తాండవిస్తున్నాయి. ప్రధాన రహదారిలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ పక్కన ఎస్సీ హాస్టల్ శిథిలావస్థకు చేరడంతో సమీపంలోని ప్రైవేటు బిల్డింగ్‌లోకి హాస్టల్‌ను మార్చారు. డ్రెయినేజీ, మరుగుదొడ్ల సమస్యతో పాటు భారీ వర్షాలు కురిస్తే హాస్టల్లో రెండు అడుగుల నీరు చేరుతోంది. ఈ ఎస్సీ బాలికల వసతి గృహంలో 3 నుంచి 9వ తరగతి వరకు 30 మంది బాలికలు చదువుతున్నారు. వీరిలో 8, 9 తరగతుల పిల్లలు 15 మంది వరకు ఉన్నారు. సమీపంలోని నిమ్మగడ్డ నాగభూషణం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఇక్కడ నుంచి నడుచుకుంటూ వెళతారు. పాత హాస్టల్లో గతంలో 170 మంది బాలికలు చదువులు కొనసాగించేవారు. భవనం శిథిలావస్థకు చేరడంతో నాలుగు నెలల క్రితం బిల్డింగ్‌లోకి మార్చారు. చిన్న చిన్న గదులు, సమీపంలో పిచ్చి చెట్లతో హాస్టల్ భవనం అసౌకర్యంగా మారింది.

వెస్టరన్ టాయిలెట్‌తో బాలికల ఇబ్బందులు

హాస్టల్లో మూడు మరుగుదొడ్లు ఉన్నాయి. ఒకటి పనిచేయడం లేదు. మరొకటి ఉన్నా కింద భాగంలో మరుగుదొడ్డిని ఎక్కువగా బాలికలు వినియోగిస్తున్నారు. వీటిలో వెస్టరన్ టాయిలెట్ కమోట్‌లు ఉన్నాయి. ముఖ్యంగా రెండు, మూడు తరగతుల బాలికలు కమోట్‌లు ఎత్తుగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు. మూడు బాత్‌రూంలకు సెప్టిక్ ట్యాంకు ఒక్కటే కావడంతో కింద భాగంలో పొంగుతోంది. దీంతో తీవ్ర దుర్వాసన భరించాల్సి వస్తోంది. ఇక డ్రెయినేజీ పారుదల లేదు. రోజువారి చెత్తను పారవేయడానికి బస్టాండ్ వరకు సిబ్బంది వెళుతున్నారు.

వర్షం వస్తే నిండా నీరే..

ఇటీవల కురిసిన వర్షాలకు రెండు అడుగుల నీరు హాస్టల్లో చేరింది. దీంతో బాలికలు కొందరు ఇంటికి వెళ్లగా మరికొందరు హాస్టల్లోనే ఉన్నారు. రాత్రి దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. కిటికీలకు దోమతెరలు లేవు. ఇటీవల కైకలూరు సీనియర్ సివిల్ జడ్జి వీవీఎన్‌వీ లక్ష్మి హాస్టల్‌ను తనిఖీ చేశారు. బాత్‌రూంల నిర్వహణపై ఆరా తీశారు. అదేవిధంగా హాస్టల్‌కు సమీపంలో ఎత్తయిన భవనాలు ఉండటంతో బాలికలు వారి పనులు చేసుకోడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యలపై హాస్టల్ వార్డెన్ నాగమణి మాట్లాడుతూ మరుగుదొడ్డను మార్పు చేయాలని ఇంటి యజమానికి తెలిపానన్నారు.



హాస్టల్లో బాలికలు వినియోగిస్తున్న మరుగుదొడ్డి

హాస్టల్ అంటే అద్దెకు ఇవ్వడం లేదు

వసతిగృహాలకు అద్దెకు ఇవ్వడానికి యజమానులు ముందుకు రావడం లేదు. శిథిలావస్థకు చేరిన పాత ఎస్సీ హాస్టల్‌ను పడగొట్టి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. ప్రస్తుతం ఉన్న హాస్టల్ యజమానితో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తాం.

– వి.వెంకటరత్నమ్మ, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్, కైకలూరు

విద్యార్థులకు స్కాలర్‌షిప్ పరీక్షలు

గుడివాడ టౌన్: తపాలాశాఖ ఆధ్వర్యంలో దీన్‌దయాళ్ స్పర్శ యోజన స్కాలర్‌షిప్ పరీక్షలు ఆదివారం నిర్వహించారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని విద్యాలయ పబ్లిక్ స్కూల్లో 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పోటీ పరీక్షలు నిర్వహించిందన్నారు. పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన 200 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. జనరల్ నాలెడ్జ్, కరెంట్ ఎఫైర్స్‌పై ఈ పరీక్ష జరిగిందన్నారు. ప్రథమ స్థాయిలో ఉత్తీర్ణులైన వారికి స్టాంప్‌ల సేకరణ అంశంపై ద్వితీయ స్థాయి ప్రాజెక్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ రెండింటిలో అర్హత పొందిన ప్రతి విద్యార్థికి సంవత్సరానికి రూ. 6 వేలు భారత ప్రభుత్వం స్కాలర్‌షిప్ రూపంలో అందజేస్తుందన్నారు. ఎంఈఓ కె.బాలాజీ, పోస్ట్‌మాస్టర్ ఎస్. శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పరీక్ష హాలును పరిశీలిస్తున్న పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులో సీసీ రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదివారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.లోకరాజు, పీఆర్ ఏఈ నాగేశ్వరరావు, ఏపీఓ పి.రాంప్రసాద్, కూటమి నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, వల్లభనేని వెంకట్రావు, పొట్లూరి రవి, పోలవరపు వెంకట్రావు, టీడీపీ నాయకులు మురాల నరేష్, నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను నెరవేరుస్తా

గుడ్లవల్లేరు: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకే గ్రామాలకు వస్తున్నామని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఆదివారం మండలంలోని గుడ్లవల్లేరు, మామిడికోళ్ల, డోకిపర్రు, కౌతవరం, వెణుతురుమిల్లి గ్రామాల్లో జరిగిన పల్లె పండగకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రాము హాజరయ్యారు. తహసీల్దార్ బి.లోకరాజు, పీఆర్ ఏఈ నాగేశ్వరరావు, ఏపీఓ పి.రాంప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రాము

ఫిల్టర్‌బెడ్ల మరమ్మతులు ప్రారంభం

గుడివాడరూరల్: నియోజకవర్గంలో తాగునీటి సమస్య ఉందని చెప్పిన వెంటనే స్పందించి నిధులు మంజూరు చేసిన డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు రుణపడి ఉంటామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. నందివాడ మండలంలోని అంబేడ్కర్‌నగర్, నందివాడ, జొన్నపాడు, గండేపూడి, పానుకుమాడు గ్రామాల్లో ఫిల్టర్ బెడ్ల మరమ్మతు పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని 43 గ్రామాల్లో ఫిల్టర్‌బెడ్ల నిర్మాణాలు, మరమ్మతులకు రూ.91 లక్షలు డీఎంఎఫ్ నిధులు, జెడ్పీ నిధులు రూ.1.36 కోట్లు, మరో రూ.కోటి ప్రభుత్వ నిధులు మంజూరయ్యాయన్నారు. ఎంపీడీఓ మల్లీశ్వరి, కూటమి నాయకులు పిన్నమనేని పూర్ణవీరయ్య, బూరగడ్డ శ్రీకాంత్, రవికుమార్, రవి, వెంకటేశ్వరరావు, ప్రభాకరరెడ్డి, అంజిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు సన్యాసిరావు పాల్గొన్నారు.

గుడివాడ మండలంలో..

మండలంలోని మల్లాయపాలెం గ్రామంలో జరిగిన పల్లె పండుగ కార్యక్రమంలో ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొన్నారు. తొలుత రూ.1.47 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు వాసే మురళీ, ఎంపీడీఓ విష్ణుప్రసాద్, పీఆర్ ఏఈ సూరిబాబు పాల్గొన్నారు.

గ్రామాల రూపురేఖలు మారుస్తాం

ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

కైకలూరు: గ్రామాల రూపురేఖలను ఏడాది లోపే మారుస్తామని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తెలిపారు. వేమవరప్పాడు, వింజరం, ఆచవరం గ్రామాల్లో పల్లె పండగ–పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా రూ.38లక్షల 74వేల నిధులతో ఏడు సీసీ రోడ్డు పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ రోడ్లు పూర్తి అనంతరం డ్రెయినేజీలకు నిధులు కేటాయిస్తామన్నారు. పక్కా ప్రణాళికతో గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, ఎంపీపీ అడవి కృష్ణ, సర్పంచ్‌లు నున్న రాంబాబు, ధర్మరాజుల నాగమ్మ, కట్టా నాగరాజుగౌడ్, కూటమి నేతలు వీరమల్లు నరసింహారావు, పెన్మత్స త్రినాథరాజు, పూలా రాజీ, బూరుబోయిన శ్రీనివాసరావు, తేరా రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వేమవరప్పాడులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కామినేని

సామూహిక వెంకటేశ్వర వ్రతాలు



స్వామివారి ఉత్సవమూర్తులు, సామూహిక వ్రతంలో పాల్గొన్న భక్తులు

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సామూహిక వెంకటేశ్వర వ్రతాలను మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు వేద మంత్రోచ్చరణ నడుమ నిర్వహించారు. వ్రతాల్లో పాల్గొన్న వారితో పాటు స్వామి దర్శనానికి అధికసంఖ్యలో భక్తులు విచ్చేశారు.

మెగా ఉచిత వైద్యశిబిరం

గుడివాడ టౌన్: లయన్స్‌క్లబ్ ఆఫ్ గుడివాడ, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మరీదు కృష్ణమూర్తి కుటుంబ సభ్యుల సౌజన్యంతో స్థానిక కాకర్లవీధిలోని గౌతు లచ్చన్న విగ్రహం వద్ద నిర్వహించిన ఈ శిబిరంలో 450 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచిత మందులు పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించి బాధితులకు ఉచిత ఆపరేషన్లతో పాటు అవసరమైన వారికి ఉచిత కళ్లజోళ్ల పంపిణీ సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ విస్సంశెట్టి కిషోర్, గుడివాడ అధ్యక్ష కార్యదర్శులు ఉప్పలపాటి సతీష్, , గుడివాడ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పెంచికలమర్రులో సీసీ రోడ్ల పనులు ప్రారంభం

కైకలూరు: ఉపాధి హామీ పథకం నిధులతో పలు గ్రామాల్లో పల్లె పండుగ పేరుతో పనులకు శంకుస్థాపనలు జరుగుతున్నాయి. పెంచికలమర్రు గ్రామంలో రూ.18.50 లక్షలతో రెండు సీసీ రోడ్లు పనులను వడ్డీ సాధికారత కమిటీ చైర్మన్ బలే ఏసురాజు ఆదివారం ప్రారంభించారు. సర్పంచ్ జయమంగళ కాసులు, మాజీ సర్పంచ్ సుబ్బరాజు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో నడుచుకోవాలి

గుడివాడరూరల్: చెడు ప్రవర్తనను మార్చుకుని నేరాలకు దూరంగా క్రమశిక్షణతో నడుచుకోవాలని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండలంలో ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగతనాలు, గొడవలు, మద్యం అక్రమ అమ్మకాలకు దూరంగా ఉండాలని సూచించారు.

యాదవ సంఘ అధ్యక్షుడిగా శ్రీహరి



కైకలూరు: నియోజకవర్గ శ్రీకృష్ణ యాదవ్ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా కలిదిండి మండలం వెంకటాపురానికి చెందిన తలారి శ్రీహరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కైకలూరు వ్యవసాయ మార్కెట్ యార్డు రైతు కల్యాణ మండపంలో మాజీ అధ్యక్షుడు చేబోయిన వీర్రాజు అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఆ సంఘ గౌరవాధ్యక్షుడు బీకేఎం.నానీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శాంతి కల్యాణం



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటరులోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల శాంతి కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఆలయ ముఖ మండపంలోని వేదికపై చేర్చి అందంగా అలంకరించి కల్యాణతంతు నిర్వహించారు. స్వామి జన్మనక్షత్రమైన కృత్తికా నక్షత్రం సందర్భంగా ఈ కల్యాణం జరిగింది.

బాణసంచా షాపులు మార్చాలి

ముదినేపల్లి రూరల్: ఈ ఏడాది దీపావళి సందర్భంగా ఏర్పాటుచేసే బాణసంచా దుకాణాలను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు తరలించాలని స్థానికులు కోరుతున్నారు. ఏటా దీపావళి మందుగుండు సామగ్రి విక్రయాలు జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో నిర్వహించేవారు. దీని వల్ల స్థానికులకు ఇబ్బంది కలగడంతో పాటు ప్రమాదకరంగా మారింది. హైస్కూల్ నుంచి షాపులు వేరే ప్రాంతానికి తరలించాలని గతంలోనే స్థానికులు కోరినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. ఈ ఏడాదైనా అధికారులు స్పందించి సమస్యలు తలెత్తకుండా ఊరికి దూరంగా ఉండే జూనియర్ కళాశాల ఆవరణకు తరలించాలని కోరుతున్నారు.

అన్నదానం గొప్పది

గుడివాడరూరల్: అన్నిదానాల్లో కెల్లా అన్నదానం గొప్పదని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. మండలంలోని జొన్నపాడు శివారు ఉన్న టెలిఫోన్‌నగర్‌లోని శ్రీఅయ్యప్పస్వామి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదానికి దాతలు సమకూర్చిన రూ.2.50 లక్షల నగదు చెక్కును ఆలయ నిర్వాహకులకు ఎమ్మెల్యే రాము ఆదివారం అందజేశారు. దాతలు ఐదుగురు ఫ్రెండ్ సర్కిల్‌గా ఏర్పడి ఒక్కొక్కరు రూ.50వేలు చొప్పున సాదం భవానీశంకరరాజు, సింగవరపు ప్రభాకరరావు, కుంపటి సుధీర్‌కుమార్, తట్టికొల్ల వెంకట మురళీ, తట్టికొల్ల వంశీకృష్ణలు రూ.2.50 లక్షలు సమకూర్చడం అభినందనీయమని ఎమ్మెల్యే రాము ప్రశంసించారు. టీడీపీ మండల అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, ఎస్ఐ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అత్యవసరమైతే 112 నంబరుకు ఫోన్ చేయాలి

కలిదిండి(కైకలూరు): హాస్టల్ విద్యార్థులు అత్యవసరమైతే పోలీసుశాఖ 112 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేయవచ్చని రూరల్ సర్కిల్ సీఐ వి.రవి కుమార్ తెలిపారు. కలిదిండిలో బాలికల, బాలుర వసతి గృహాలను ఆదివారం పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాలతో నియోజకవర్గంలో అన్ని వసతి గృహాలను ఆయా మండల ఎస్ఐలు తనిఖీ చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు రామకృష్ణ, ఎస్ఐ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొండలమ్మకు మొక్కుల చెల్లింపు

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో పాల పొంగళ్లను పొంగించిన మహిళా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణం ఆదివారం వేలాది సంఖ్యలో భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి దర్శనానికి క్యూలో బారులు తీరారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ ఆకుల కొండలరావు ఏర్పాట్లు చేశారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం

కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కూచిపూడి రవిప్రకాష్ సిలికానాంధ్ర సంజీవని సాయి ఆరోగ్య వైద్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరం ద్వారా 140 మందికి సేవలందించారు. కాశీబొట్ల నారాయణమూర్తి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని కూచిపూడి ఎస్ఐ సుబ్రమణ్యం ప్రారంభించారు. ఉయ్యూరు సమత శంకర నేత్ర చికిత్సాలయం వైద్యులు డాక్టర్ తేజశ్వి సేవలందించారు. కార్యక్రమంలో సొసైటీ మండల శాఖ చైర్మన్ బెల్లంకొండ వెంకటేశ్వరరావు, హాస్పిటల్ ఏఓ జే హనుమకుమార్, కూచిపూడి రోటరీ క్లబ్ అధ్యక్షుడు కోనేరు మంజునాథ్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకోవాలి




పామర్రు(పెదపారుపూడి): ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకుంటే గ్రామాలు సుఖశాంతులతో ఉంటాయని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. పెదపారుపూడి మండలం యలమర్రులో అంకమ్మతల్లి గుడి సంబరాల్లో ఎమ్మెల్యే ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ఆలయాలను నిర్మించి వాటిలో ఆధ్యాత్మికమైన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. అనంతరం గ్రామంలోని ఎస్సీ కాలనీలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా పలు సీసీ రోడ్ల భూమి పూజ చేశారు. తదుపరి బిలీవర్స్ చర్చి అతిథి గృహాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.

భారీ వర్షం



గుడివాడ టౌన్: గుడివాడ పట్టణంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండు గంటల వరకు ఎడతెరపి లేకుండా వర్షం కారణంగా రోడ్లు జలమయమయ్యాయి. ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

రూ.3 కోట్లతో ఆలయాల నిర్మాణం



గుడ్లవల్లేరు: పెసరమిల్లిలో శివశ్రీ కాశీనాథుని సుబ్రహ్మణ్యం వంశీకులు నిర్మిస్తున్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరాలయంతో పాటు అదే ప్రాంగణంలో వివిధ ఉపాలయాల నిర్మాణం దాతల సహకారంతో జరుగుతుంది. శ్రీ సాయి మందిరాన్ని దాత మాజీ డీఎస్పీ కమ్మిలి మాణిక్యాలరావు ఆర్థిక సాయంతో నిర్మిస్తున్నారు. అయ్యప్ప ఆలయాన్ని దాత వర్రే తిలక్ ఆర్థిక సాయంతో నిర్మాణ పనులు సాగుతున్నాయి. శివాలయాన్ని దాత సాంబశివరావు ఆర్థిక సాయంతో నిర్మిస్తున్నారు. సుమారు రూ.3కోట్లతో ఈ ఆలయాలను నిర్మిస్తున్నట్లు స్థానికులు తెలిపారు.

కోతులు పట్టివేత

ముదినేపల్లి రూరల్: ముదినేపల్లి పంచాయతీ పరిధిలో కొన్నిరోజులుగా ప్రజలను పట్టిపీడిస్తున్న కోతుల బెడద ఎట్టకేలకు తొలగిపోయింది. పంచాయతీ ఆధ్వర్యంలో ఆదివారం కోతులు పట్టే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. స్థానిక అంబేడ్కర్‌నగర్‌లో కోతులు పట్టే వ్యక్తులు అధిక సంఖ్యలో కోతులను పట్టి బంధించారు. వీటిని ప్రత్యేక వాహనంలో భద్రాచలం సమీపంలోని అడవులకు తరలిస్తున్నట్లు సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ తెలిపారు.